క్లుప్తంగా

గూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా మురళి



రెడ్డి మురళి

గుర్ల: మండలంలోని గూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా గుజ్జింగివలసకు చెందిన రెడ్డి మురళి నియమితులయ్యారని పీఏసీఎస్ సీఈఓ శీర స్వామి బుధవారం తెలిపారు. ఇది వరకు చైర్మన్‌గా ఉన్న బెల్లాన వెంకటరమణ పదవీకాలంలో ఈ ఏడాది ఫిబ్రవరితో ముగియడంతో కొత్త చైర్మన్‌గా మురళిని ప్రభుత్వం నియమించిందని చెప్పారు.ఈయన ఈనెల24న బాధ్యతలు స్వీకరించనున్నారు.

చలివేంద్రం ప్రారంభం

బొండపల్లి: మండలంలోని అంబటివలస జాతీయ రహదారి 26 పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపూడి అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు నెలల పాటు చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా



నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

చీపురుపల్లి: స్థానిక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇటీవలే పదో తరగతి పరీక్షలు పూర్తవ్వడంతో మిగిలిన విద్యార్థులు అంతా కలిసి వారికి వీడ్కోలు పలికారు. విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హెచ్‌ఎం డి.గౌరీదేవి, పీఎంసీ కమిటీ ప్రతినిధి మీసాల సీతారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-సేవలు పెంచాలి

చీపురుపల్లి: గ్రామ సచివాలయాల్లో ఈ-సేవలను పెంచే దిశగా సిబ్బంది పని చేయాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి సచివాలయం-2ను బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఎస్‌డీజీ, పీఎంజీఎస్‌వై సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో పిట్టవాని కొనేరులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. పని ప్రదేశాల్లో వేతనదారుల కోసం ప్రథమచికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నీడ కోసం టెంట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లకు సూచించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ ,టెక్నికల్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం పనులను చేయాలని, రెండుపూటలా పనులకు హాజరు కావాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వాళ్లు మాత్రమే పనులకు హాజరు కావాలని తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీల సందర్శన

గుర్ల: మండలంలోని భూపాలపురం, ఆనందపురంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ)ను ఎస్‌డబ్ల్యూపీసీల రీసెర్చ్ పర్సన్ చంద్రకళ, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు బుధవారం సందర్శించారు. కేంద్రాల్లో వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావును ఆదేశించారు. మండలంలో నిర్మాణాలు పూర్తయిన ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

అభివృద్ధిపనులకు ఆమోదం

వేపాడ: మండలంలోని చినగుడిపాల, ముకుందపురం గ్రామాల్లో పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో సర్పంచ్‌లు అధ్యక్షతన బుధవారం గ్రామ సభలు నిర్వహించారు.గ్రామాల్లో అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయగా, వాటిని సభ్యులు ఆమోదించారు. చినగుడిపాల, ముకుందపురం సర్పంచ్‌లు బోజంకి రామునాయుడు, నాగిరెడ్డి కనకరాజు, వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల పంపిణీకి సబ్ కమిటీలు

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్ల పంపిణీకి సబ్ కమిటీలను నియమించినట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో బుధవారం ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఐఈఆర్టీలతో సమావేశమై మండలంలో జేవీకే కిట్ల పంపిణీకి సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాకానుక కిట్లు మేనెలలో మండలానికి చేరనున్నాయని చెప్పారు. వీటిని గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఆరు గదుల్లో భద్రపరిచి, అక్కడి నుంచి స్కూళ్లకు పంపిణీ చేస్తామని వివరించారు. అలాగే మండలంలోని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు విద్యా బోధనతో పాటు పిల్లలకు ఆరోగ్యం సూత్రాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



బొండపల్లి: సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



బొండపల్లి: ఒంపల్లిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



కొత్తవలస: ఎం. రామచంద్రపురంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

బొండపల్లి: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు పల్లెల్లోనే అందుతున్నాయని, మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పని తప్పిందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని ఒంపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో పాటు ఆయన చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దేశంలోని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ప్రజలకు అన్ని సేవలూ గ్రామస్థాయిలోనే అందే విధానం దేశంలో ఇంకెక్కడా లేదన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా పంట కొనుగోలుతో పాటు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీ, వ్యవసాయ సంబంధ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు.

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

సచివాలయ భవనం ప్రారంభోత్సవం అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించడమే ధ్యేయంగా గడప గడపకూ వస్తున్నామని చెప్పారు. స్థానిక సర్పంచ్ లండా నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభాజీ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఏ.వేదవతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వేంద్రాం సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, పల్లి రఘు, బొద్దల చిన్నంనాయుడు,పంచాయతీరాజ్ జేఈఈ పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నతామరాపల్లిలో..

బొండపల్లి: మండలంలోని చిన్నతామరాపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం' నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.వేదవతి బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య పాల్గొంటారని మండల అధికారులు, సంబంధిత సచివాలయ అధికారులు హాజరు కావాలని కోరారు.

జగనన్నను ఆశీర్వదించండి

కొత్తవలస: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం-5 పరిధి చీపురువలస , ఎం.రామచంద్రపురం గ్రామాల్లో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలనువెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూడలేక ప్రతిపక్ష పార్టీలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వం పాలన కరువు కాటకాలతో ఉంటే... ఇప్పుడు జగనన్న పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, నాయకులు మేలాస్త్రీ అప్పారావు, బొంతల వెంకటరావు, ఆతవ రమేష్, మేజర్ పంచాయతీ ఈఓ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కడుబండి,ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఇటీవల మృతిచెందిన వైస్ ఎంపీపీ దండేకర్ కుమారికి నివాళులర్పించారు. అనంతరం గత సమావేశంలో తెలియజేసిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఆయా శాఖాధికారులు వివరించారు. అధికారులు తమను అస్సలు పట్టించుకోవడం లేదని.. ప్రోటోకాల్ పాటించడం లేదని పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అతి పెద్ద సాగునీటి చానల్ సిస్టమ్ మార్లాపల్లి చానల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయా లని అధికారులకు సూచించారు. తహసీల్దార్ టి.రామకృష్ణ మాట్లాడుతూ, అరుకు-విశాఖ రోడ్డును నా లుగు లేన్లగా విస్తరించనున్నారని, పనులు చేపట్టే ఇంజినీర్లకు అంతా సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ టి.వరలక్ష్మి, వైస్ ఎంపీపీ శ్యామల పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం

• కలెక్టర్ నాగలక్ష్మి



గొడికొమ్ములో అధికారులకు పలు సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జామి: గృహనిర్మాణాలు వేగవంతం చేసి రెండు నెలల్లో ప్రగతి సాధించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని గొడికొమ్ము, అలమండ, కుద్దిపాలెం, శింగవరం గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ముందుగా గొడికొమ్ము గ్రామంలో కొత్తచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజువా రీ వేతనం రూ.250 వచ్చేలా పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షించారు.వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అలమండ సచివాలయా న్ని సందర్శించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అలాగే కుద్దిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పరిశీలించి, వైద్యాధికారి పద్మావతితో మాట్లాడారు. అక్కడ నుంచి జి.శిగవరం గ్రామానికి వెళ్లి భూరీ స ర్వేను పరిశీలించారు.ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, హౌసింగ్ పీడీ ఎస్.వి.రమణమూర్తి,డీఈ వాసుదేవరావు, ఉపాధి ఏపీడీ శారదాదేవి, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీఓ సతీష్, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి నిర్మలాదేవి, ఎంఈఓ జయశ్రీ, హౌసింగ్ ఏఈ వెంకటరావు, ఉపాధి హామీ ఏపీ ఓలు శేఖర్, కిరణ్మయి, ఏఓ కిరణ్‌కుమార్, పశువైద్యాధికారులు నరేష్, అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, గొడికొమ్ము, అలమండ సర్పంచ్‌లు పిల్లల భవానీ, కోట పాపమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించండి



ఉపాధి సిబ్బందితో సమావేశమైన ఎంపీడీఓ రామకృష్ణరాజు



దత్తిరాజేరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

చీపురుపల్లి: ఉపాధి పనుల ప్రదేశంలో వేతనదారులకు తాగునీటి సౌకర్యం కల్పించేలా, నీడ కోసం టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ, ఈసీ, ఫీల్డు అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా వేతనదారులు ఉదయం 7 గంటలకే పని ప్రారంభించి 10గంటలకు ముగించాలని, తిరిగి మధ్యాహ్నం పనులు నిర్వహించాలన్నారు. వేతనదారులకు గరిష్ట వేతనం అందేలా రెండు పూటలా పనులు చేయించాలని, పనులకు హాజరయ్యే వారికి మాత్రమే మస్తర్లు వేయాలని సూచించారు. ఏపీఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది తలెత్తకూడదు

దత్తిరాజేరు: ఉపాధి హామీ పనులకు హాజరయ్యే వేతనదారులకు పని ప్రదేశంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని, నీడ కోసం టెంట్లు వేయాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఎండీడీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు పనులు చేయాలని సూచించారు. వేతనదారులకు మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఏపీఓలు సత్యవతి, వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోండి..

బొండపల్లి: ఈ నెలాఖరులోగా కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులతో పాటు వివిధ కారణాల వల్ల ఇంతవరకు రైతుభరోసా అందని వారు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పీవీ మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30లోగా రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో గాని సచివాలయాల్లో గాని దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

నేడు జెడ్పీ చైర్మన్ పర్యటన

వేపాడ: మండలంలోని వీలుపర్తి, వల్లంపూడి గ్రామాల్లో గురువారం నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్- మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరు కానున్నారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



కొత్తవలస: పీహెచ్‌సీ వద్ద మంటలను గ్యాస్ ద్వారా అదుపు చేసే విధానంపై అవగాహన



శృంగవరపుకోట: మంటలను అదుపు చేసే విధానంపై ఆస్పత్రి సిబ్బందికి వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొత్తవలస: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. మంటలు చెలరేగినప్పుడు ఎటువంటి నివారణ చర్యలు చేపట్టాలో అగ్నిమాపక అధికారి అశోక్‌కుమార్ వివరించారు. అలాగే కంటకాపల్లి గ్రామ సచివాలయం వద్ద శారదా కర్మాగారం యాజమాన్యం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు మదీన అప్పలరమణ, శారదా కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై స్థానిక కోలపర్తి ఆస్పత్రి వద్ద అగ్నిమాపక శాఖ అధికారి షేక్ మదీనా నేతృత్వంలో బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో ప్రాణనష్టం కాకుండా ఎలా కాపాడుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయడం, వారిని భవనాల నుంచి బయటకు ఎలా తేవాలి, ఆస్పత్రిలో ఉన్న ఫైర్ ఎక్స్‌టింజర్లు ఎలా వినియోగించాలి, ఫైర్‌వాల్స్ ఎలా వాడాలి అన్న అంశాలపై ఆస్పత్రి సిబ్బందికి వివరించారు.

గజపతినగరంలో..

గజపతినగరం: అగ్నిప్రమాదాల నివారణపై స్థానిక శ్రీనివాసా నర్సింగ్ హోమ్ వద్ద అగ్నిమాపకశాఖ అధికారి ఎం.ఎస్.వి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఆస్పత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మొక్కలు నాటించండి



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న అధికారులు

శృంగవరపుకోట: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల్లో చనిపోయిన వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటించాలని ఉపాధి సిబ్బందికి అధికారులు ఆదేశించారు. ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులపై అధికారులు సమీక్షించారు. పలు చోట్ల చేసిన ప్లాంటేషన్‌లో మొక్కలు చనిపోయినట్టు గుర్తించారు. మొక్కలు పోయిన చోట మొక్కలు నాటించాలని, మొక్కలు నాటలేమన్న వారి నుంచి బిల్లులు రికవరీ చేయాలని ఆదేశించారు. కాంక్రీటు పనులపై ఇచ్చిన రిపోర్టులను సమీక్షించారు. ఉపాధి హామీపథకం ఏపీడీ జనార్దనరావు, క్లస్టర్ ఏపీడీ శారదాదేవి,డీవీఓ రవీంద్ర, ఎంపీపీ సోమేశ్వరరావు, ఎంపీడీఓ శేషుబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రయ్.. రయ్



రామవరం వద్ద పూర్తయిన రోడ్డు విస్తరణ

గంట్యాడ: ఎస్.కోట మండలంలోని బొడ్డవర నుంచి గంట్యాడ మండలం తాటిపూడి, కొర్లాం, కొఠారుబిల్లి, నరవ, రామవరం మీదుగా కలెక్టరేట్ జంక్షన్ వరకు సుమారు 30 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. గతంలో 30 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డును 60 అడుగుల వెడల్పు చేస్తున్నారు. రూ. 90 కోట్లతో ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపడుతున్నారు. గతంలో గోతులతో ఉండే ఈ రోడ్డుపై ప్రయాణం చేసేందుకు ప్రజలు అవస్థలు పడేవారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ, అభివృద్ధి కావడంతో వాహనచోదకులు రయ్ రయ్ మంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



ప్రచారభేరి ర్యాలీలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, తదితరులు

గజపతినగరం: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోదీ సర్కార్‌ను గద్దె దింపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రజాసొమ్ము ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. దళితులు, గిరిజనులు, రైతులు, కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానిక రానున్న రోజుల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.లక్ష్మి, ఆర్.ఈశ్వరరావు, ఎస్.నారాయణ రావు, పి.సూర్యనారాయణ, శ్రీను, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



ఉద్యోగాలకు ఎంపికైన వారిని సత్కరిస్తున్న శిక్షకులు

చీపురుపల్లి: స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉచితంగా శారీరక ధారుఢ్య శిక్షణ తీసుకుని రైల్వే గ్రూప్-డి ఉద్యోగాలు సాధించిన వివిధ గ్రామాలకు చెందిన 11 మంది యువకులను ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. పట్టణానికి చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి హేమంత్, నవీన్‌ల ప్రోత్సాహంతో జీవీఆర్ కళాశాల మైదానంలో యువతకు రోజూ ఉదయం, సాయంత్రం ఉచితంగా శారీరక ధారుఢ్య శిక్షణ ఇస్తున్నారు. చీపురుపల్లి, గరివిడి మండలాల పరిసర గ్రామాల నుంచి దాదాపు వంద మంది వరకు శిక్షణకు హాజరవుతున్నారు.

ఊరూరా.. ఉత్సాహంగా



చీపురుపల్లి: చీపురుపల్లిలోని బజారువీధిలో పథకాలను వివరిస్తున్న నాయకులు

'జగనన్నే మా భవిష్యత్ – మానమ్మకం నువ్వేజగన్' కార్యక్రమం ఊరూరా ఉత్సాహంగా సాగుతోంది. చీపురుపల్లి, శృంగవరపుకోట, గజపతినగరం నియోజకవర్గాల్లోని పలుగ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సర్వే చేశారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్ పార్టీలకు అతీతంగా ఇంటింటికీ పథకాలు అందిస్తున్నారని, సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. టీడీపీ పాలనలో చంద్రబాబు చేసిన మోసాలను గుర్తు చేశారు. అనంతరం ప్రజల ఇళ్లకు వారి అనుమతితో 'మానమ్మకం నువ్వు జగన్' స్టిక్కర్‌ను అతికించారు.

– సాక్షి నెట్‌వర్క్



బొండపల్లి: గొట్లాంలో పథకాలపై సర్వే చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ, నాయకుడు తులసీరాం



దత్తిరాజేరు: భోజరాజపురంలో పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు, తదితరులు



గుర్ల: జమ్ములో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ నరసింహమూర్తి, గృహ సారథులు



చీపురుపల్లిరూరల్: నిమ్మలవలసలో పథకాలను వివరిస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసరావు, తదితరులు



వేపాడ: భర్తవానిపాలెంలో పథకాలను వివరిస్తున్న నాయకులు



గజపతినగరం: పురిటిపెంట న్యూకాలనీలో ఇంటికి 'మానమ్మకం నువ్వు జగన్' స్టిక్కర్‌ను అతికిస్తున్న నాయకులు



గంట్యాడ: పొల్లంకిలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైహింద్‌కుమార్, సర్పంచ్ రమణమ్మ



వేపాడ: వల్లంపూడిలో పథకాలను వివరిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు